క్లుప్తంగా

తహసీల్దార్ అనితకుమారి బాధ్యతల స్వీకరణ



ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును కలిసిన అనితకుమారి

మలికిపురం: నూతన తహసీల్దార్‌గా జి.అనిత కుమారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూల మొక్కను అందజేశారు.

19న ధనమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ



ధనమ్మ తల్లి విగ్రహం

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామంలోని ధనమ్మపేటలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ధనమ్మ అమ్మవారి నూతన ఆలయ, విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 19న జరుగుతుందని ఆలయ కమిటీ గురువారం తెలిపింది. ఈ నెల 18వ తేదీ నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొంది. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, గ్రామోత్సవం, ఉదక శాంతి, అమ్మవారి విగ్రహ జలాధివాస, క్షీరాధివాస, ధాన్యాధివాసం తదితర పూజాది కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. 19న విగ్రహ పునః ప్రతిష్ఠ అనంతరం అన్న సమారాధన ఉంటుందని కమిటీ తెలిపింది.

వైభవంగా రావులమ్మ పంట జాతర



రావులమ్మ అమ్మవారు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో ఉన్న రావులమ్మ అమ్మవారి పంట జాతరను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఏటా రావులమ్మ అమ్మవారి పంట జాతరను నిర్వహించడం వల్ల పంటలు బాగా పండుతాయని గ్రామస్తుల విశ్వాసం. ఇందులో భాగంగా అమ్మవారికి చలివిడి, పానకాలు, ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మూడు నెలల వేతనాల చెల్లింపు



చెక్కు అందజేస్తున్న చైర్‌పర్సన్ సత్యనారాయణ

మామిడికుదురు: పాశర్లపూడి రైతు భరోసా కేంద్రంలో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసిన టీఏ, డీఈఓ, హెల్పర్‌కు మూడు నెలల వేతనం రూ.90,600 చెక్కును పీఏసీఎస్ చైర్‌పర్సన్ యూవీవీ సత్యనారాయణ అందించారు. సొసైటీలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అటు రైతులకు, ఇటు ప్రభుత్వానికి అనుసంధానంగా సేవలందించారని వారిని అభినందించారు. సొసైటీ సీఈఓ వై.ఏసురాజు, డైరెక్టర్లు గంధం మాణిక్యం, వాసంశెట్టి వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్కూలుకు స్కానర్ కం ప్రింటర్ వితరణ



హెచ్‌ఎంకు ప్రింటర్ ఇస్తున్న వెంకన్నబాబు

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలకు గురువారం స్థానిక దాత డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ కుమారుడు వెంకన్నబాబు రూ.14 వేల విలువైన స్కానర్ కం ప్రింటర్‌ను అందజేశారు. హెచ్‌ఎం పడాల సోమసూర్యకుమారికి వీటిని అందించారు. వెంకన్నబాబును సిబ్బంది సత్కరించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు దూది త్రినాథ్ పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సుకే డీసీసీబీ సేవలు

కాజులూరు: డీసీసీ బ్యాంక్ గోల్డ్‌లోన్ సదుపాయాన్ని ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం కో–ఆపరేటివ్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ నున్న మాచరరావు కోరారు. వాణిజ్య బ్యాంకుల్లాగే అన్ని రకాల బ్యాంకింగ్ సేవలను డీసీసీబీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తమ బ్యాంక్ పని చేస్తుందన్నారు.

తరిమేద్దాం..

- డీ–వార్మింగ్ డే సందర్భంగా నేడు మాత్రల పంపిణీ
- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- నులి పురుగుల నిర్మూలనపై అవగాహన
- చిన్నారుల ఆరోగ్య రక్షణే ధ్యేయం
- ఏడాదిలోపు పిల్లలకు ఆల్బెండజోల్ అపాయకరం

ఆలమూరు: చిన్నారులకు తరచూ కడుపులో సంభవించే రక్తహీనత, నిద్రలేమి, నీరసం, కడుపునొప్పి తదితర రుగ్మతలను నివారించేందుకు ఏటా ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీ–వార్మింగ్ డేను నిర్వహిస్తున్నాయి. చిన్నారుల్లో నులిపురుగు నివారణకు ఏడాదికి రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం ద్వారా చిన్నారులకు మరింత ఆరోగ్యం చేకూరుతుంది. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9(శుక్రవారం) నుంచి డీ–వార్మింగ్ డే నిర్వహిస్తున్న సందర్భంగా కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నులిపురుగు నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా సిబ్బందితో ముమ్మరంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లు పూర్తి

డీ–వార్మింగ్ డేలో మాత–శిశు సంక్షేమ, పంచాయతీ రాజ్, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తారు. డీ–వార్మింగ్ డేను విజయవంతం చేసేందుకు జిల్లా వైద్యారోగ్య శాఖ క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా 68 మంది వైద్యాధికారులు, 23 మంది ఫార్మాసిస్టులతో పాటు, వందలాది మంది ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 852 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. సుమారు 75 వేల మంది విద్యార్థులు, పది వేల మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలను వేసేందుకు సర్వం సిద్ధమైంది.

మోతాదుకు అనుగుణంగా..

ఆల్బెండజోల్ మాత్రలను మింగించేటప్పుడు తప్పక



పెదపళ్లలో డీ–వార్మింగ్ డేపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న వైద్యారోగ్య శాఖ అధికారులు

జాగ్రత్తలు పాటించాలి. చిన్నారులు, విద్యార్థుల వయస్సును బట్టి మాత్రలను అందించాలి. ఏడాది లోపు చిన్నారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వరాదు. 1–2 ఏళ్ల లోపు చిన్నారులకు ఆల్బెండజోల్ 400 మి.గ్రా. మాత్రలో సగం మాత్రను పొడిచేసి, నీటిలో కలిపి ఇవ్వాలి. 2–5 ఏళ్ల లోపు పిల్లలకు మాత్రను పొడి చేసి, పూర్తిగా నీటిలో కలిపి తాగించాలి. 6–19 ఏళ్ల లోపు వయస్సున్న వారికి మాత్రం మాత్రను మింగించాలి. ఈ మాత్రలను మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత మాత్రమే తీసుకోవాలి. లేకుంటే మాత్రలు మింగిన వారికి వాంతులు, విరేచనాలు, కడుపులో తిప్పడం వంటి దుష్ఫలితాలొచ్చే అవకాశం ఉంది.

నులిపురుగు ప్రభావం ఇబ్బందికరం

కడుపులో పేరుకుపోయిన నులిపురుగు వల్ల పిల్లల్లో తీవ్ర అనారోగ్య సమస్యలు ఏర్పడతాయి. పిల్లల కడుపులో సంభవించే కొంకి, నులి, బద్దె తదితర గుండ్రని పురుగులు రక్తాన్ని పీల్చేస్తాయి. ఆ పురుగుల వృద్ధి పూర్తిగా కడుపులోనే జరగడం వల్ల, పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లలు తీసుకునే ఆహారమంతా ఆ పురుగులే పీల్చేస్తాయి. దీనివల్ల పదేళ్ల లోపు పిల్లలకు అనేక ఆరోగ్య, శారీరక సమస్యలు ఏర్పడతాయి.

మాత్రలతో సంపూర్ణ ఆరోగ్యం



వయస్సుకు అనుగుణంగా ఆల్బెండజోల్ మాత్రలను తీసుకోవడం ద్వారా పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత, చేతులను శుభ్రంగా కడుక్కుని మాత్రలను వేసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకుండా ఉండాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతను తప్పకుండా పాటించాలి.

– డి.సువర్చలాదేవి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, చొప్పెల్ల

సద్వినియోగం చేసుకునేలా చర్యలు



ఇప్పటికే డీ–వార్మింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు నిర్ణీత సమయంలో మోతాదుకు అనుగుణంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తాం. ఏ విధమైన దుష్పరిణామాలు లేకుండా చర్యలు తీసుకుంటాం. ఒకటి నుంచి 17 ఏళ్ల లోపు పిల్లలందరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలి.

– పి.ఉమ, హెల్త్ విజిటర్, పీహెచ్‌సీ, పెదపళ్ల

విజయమే లక్ష్యంగా పని చేద్దాం

- వైఎస్సార్ సీపీ నేతల పిలుపు

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా మండలంలోని ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పిలుపునిచ్చారు. గంగలకుర్రు అగ్రహారంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ స్వగృహం వద్ద, ఆయన అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తల అత్యవసర సమావేశాన్ని గురువారం నిర్వహించారు. రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరు శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసేలా ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్ రెడ్డితో మరో వారం రోజుల్లో సమావేశం జరుగుతుందని శేఖర్ తెలిపారు. అనంతరం కొత్తగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా నియమితులైన శేఖర్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముక్తాబత్తుల ప్రశాంత్, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, నాగవరపు నాగరాజు, కొర్లపాటి కోటబాబు, వాసంశెట్టి పెదబాబు, ఎంఎం శెట్టి, మైల ఆనందరావు, కుందుర్తి నాగబాబు, మట్టపర్తి హరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు

అందరి సహకారంతో నిర్మూలన



మామిడికుదురులో ఏఎన్‌ఎంకు మాత్రలను అందజేస్తున్న ఎంపీడీఓ

మామిడికుదురు: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించాలని ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నులి పురుగుల నిర్మూలనపై ఏఎన్‌ఎంలు, ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం జరిగింది. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం శుక్రవారం జరుగుతుందన్నారు. ఐదేళ్లు దాటిన వారికి డీ వార్మింగ్ మాత్రలు మింగించాలన్నారు. మండలంలోని 22 సచివాలయాల పరిధిలో సుమారు 14 వేల మంది విద్యార్థులు ఉన్నారన్నారు. అందరికీ విధిగా డీ వార్మింగ్ మాత్రలు అందించేలా ఏఎన్‌ఎంలు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పిల్లల్లో రక్తహీనతను నివారించాలి

అంబాజీపేట: పిల్లల్లో రక్తహీనతకు ప్రధాన కారణమైన నులిపురుగుల నివారణకు అంకితభావంతో పనిచేయాలని వైద్యాధికారులు శ్రీనివాసులు అన్నారు. అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులిపురుగుల నివారణపై వైద్య సిబ్బందికి గురువారం సూచనలు చేశారు. ఈ నెల 9న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9,250 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. అన్ని అంగన్‌వాడీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో ఐదేళ్లు దాటిన చిన్నారుల నుండి 19 ఏళ్ల లోపు విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తామన్నారు. కార్యక్రమం విజయవంతానికి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం



విజేత జట్టును అభినందిస్తున్న నాయకులు, గ్రామస్తులు



రామేశ్వరం వాలీబాల్ జట్టును సత్కరిస్తున్న శివకుమార్



బహుమతులు అందుకుంటున్న చందు

మలికిపురం: మానసికోల్లాసం కలిగించడమే కాక, ఆరోగ్యాన్ని పెంపొందించడానికి కూడా క్రీడలు దోహదపడతాయని మలికిపురం ప్రభుత్వ ఎయిడెడ్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మంగెన వేంకట సత్యనారాయణమూర్తి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో కళాశాలలో బీఎస్సీ. బోటనీ ప్రథమ సంవత్సరం చదువుతున్న చెల్లింగి చందు నియోజకవర్గ స్థాయి మహిళల వాలీబాల్ పోటీలో ప్రథమ స్థానాన్ని, జిల్లా స్థాయిలో అమలాపురంలో జరిగిన పోటీలో ద్వితీయ స్థానాన్ని పొందిన సందర్భంగా కళాశాలలో గురువారం అభినందన సభను ఏర్పాటు చేశారు. పోటీల్లో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ప్రభుత్వం ఇచ్చిన జ్ఞాపికలు, పతకాలు, ప్రశంసాపత్రాలు, రూ.10,800 నగదును ఆమెకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తోరం సతీష్, విజయ్‌కుమార్, రాహేల్ బాబు, చిట్టాల సత్యనారాయణ, పీడీ కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరం వాలీబాల్ జట్టుకు సత్కారం

సఖినేటిపల్లి: అమలాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన రామేశ్వరం వాలీబాల్ జట్టుకు గురువారం నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్ రూ.5 వేల ప్రోత్సాహక నగదు అందజేశారు. ఈ మేరకు రామేశ్వరంలో ఆయన జట్టు సభ్యులను సత్కరించారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు వెళుతున్న రామేశ్వరం జట్టుకు అభినందనలు తెలిపారు.

నగదు ప్రోత్సాహకం

సఖినేటిపల్లి: అమలాపురంలో ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో రాష్ట్ర స్థాయిలో ఎంపికైన రామేశ్వరం వాలీబాల్ జట్టుకు గురువారం కేశవదాసుపాలేనికి చెందిన జనసేన నాయకుడు యెనుముల వెంకటపతిరాజు రూ.15 వేల ప్రోత్సాహక నగదు ప్రకటించారు. ఈ మొత్తాన్ని పార్టీ నాయకుడు వరప్రసాద్ జట్టు సభ్యులకు అందజేశారు.

జిల్లా స్థాయి కబడ్డీ విజేతలకు సత్కారం

మలికిపురం: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో కబడ్డీ పురుషుల విభాగంలో జిల్లా స్థాయి విజేతగా నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన మలికిపురం మండలం శంకరగుప్తం–1 జట్టును గ్రామంలో గురువారం జరిగిన సభలో సత్కరించారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి, విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మట్ట శైలజ, సర్పంచ్ రాపాక ఆనందకుమార్, చింతా కుమార్‌రాజా, యడ్ల పెద్దిరాజు, ఎంపీటీసీ మునుకొండ ప్రమీల, తాడి సహదేవ్, నల్లి శివకుమార్ పాల్గొన్నారు.

ఎస్సైకి వైఎస్సార్ సీపీ నేతల సత్కారం

అంబాజీపేట: నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అంబాజీపేట ఎస్సై కె.చిరంజీవిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పూలమాల వేసి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ మండలంలో మాదకద్రవ్యాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రజా జీవనానికి అంతరాయం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు బండారు మల్లి, చింతపల్లి వెంకటేశ్వరరావు, ఎంఎం శెట్టి, కోట విజయరాజు, గోసంగి కుమార్‌స్వామి, వక్కలంక రాధాకృష్ణ, కుసుమ వెంకటేష్, మట్టా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో ఎస్సైని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలి

రాజోలు: రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ సూచించారు. పలు గ్రామాల్లో పంపిణీ చేస్తున్న ఎలుకల మందు కార్యక్రమాన్ని గురువారం ఆయన పర్యవేక్షించారు.

పొదలాడ ఆర్‌బీకే వ్యవసాయ సహాయకుడు జి.తరుణ్ ఆధ్వర్యంలో ఎలుక నిర్మూలన మందును సర్పంచ్ కడలి సత్యనారాయణ, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు రైతులకు అందజేశారు. మధుకుమార్ మాట్లాడుతూ ఎలుకలు నిర్మూలించే మందును వ్యవసాయ శాఖ ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. ఒక హెక్టారుకు 10 గ్రాముల మందు వాడాలన్నారు. వంద గ్రాముల విషపు ఎర తయారు చేసుకునేందుకు రెండు గ్రాముల బ్రోమోడయోలోన్, 96 గ్రాముల నూకలు, రెండు గ్రాముల నూనె కలిపిన మిశ్రమాన్ని పది గ్రాముల చొప్పున పొట్లాలు కట్టుకోవాలన్నారు. ఆ పొట్లాలను ఎలుకల బొరియల వద్ద, వరి చేను గట్ల మీద పెట్టాలన్నారు.



పొదలాడలో రైతులకు ఎలుకల నిర్మూలన మందు అందిస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

శరవేగంగా నరజాడ–కూళ్ల రోడ్డు పనులు



కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులు

కె.గంగవరం: మండలంలోని నరజాడ–కూళ్ల రహదారికి మహర్దశ నెలకొంది. కొన్నేళ్లుగా ఈ రహదారి గుంతలమయంగా మారడంతో రెండు గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఇటీవల రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ గ్రామ పర్యటన చేసే క్రమంలో, ఈ రహదారి సమస్యను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. నిధులు మంజూరు చేయడంతో పాటు, రహదారి నిర్మాణ పనులు వెంటనే జరపాలని ఆదేశాలు కూడా ఇచ్చారు. దీంతో నాలుగు రోజులుగా రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు వారాల్లో పనులు పూర్తి చేసి, రహదారిని ప్రారంభిస్తామని కాంట్రాక్టర్ తెలిపారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయండి

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం, అయినవిల్లి లంక గ్రామాల్లో నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ డీఎల్ ప్రమద్వార్ పంచాయతీ, గ్రామ రెవెన్యూ కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక గ్రామాల్లో ఆయన పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ అశోక్ ఉన్నారు.

ఇరిగేషన్ వ్యవస్థను మెరుగుపర్చాలని వినతి



అమలాపురంలో జేసీని కలిసిన రైతు సంఘ ప్రతినిధులు

సఖినేటిపల్లి: మండలంలో వివిధ పంట కాలువలపై శివారునున్న ఆయకట్టు భూములకు ఇరిగేషన్ వ్యవస్థ మెరుగుపర్చాలని కోరుతూ గురువారం ఏపీ రైతు సంఘం, కోనసీమ జిల్లా ప్రతినిధులు జేసీ నుపూర్ అజయ్ కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు అమలాపురంలో జేసీ నుపూర్‌ను, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన తాతారావు, రైతు సంఘం సీనియర్ నాయకుడు సీహెచ్ కేశవశెట్టి ఆధ్వర్యంలో రైతులు కలిశారు. ప్రధానంగా అంతర్వేది ఎల్‌ఎఫ్ ఛానల్, కొబ్బరితోట ఛానల్, మామిడితోట ఛానల్, అద్దాలపాలెం ఛానల్లపై శివారు భూములు సాగులో ఇబ్బందులు పడుతున్నట్టు వివరించారు. వీటిని పరిశీలించి, మెరుగైన ఇరిగేషన్ వ్యవస్థ కల్పించాలని వారు కోరారు. నాయకులు జంపన ప్రసాదరావు, వాసంశెట్టి సత్తిరాజు, కుంపట్ల వరుణబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమం జరగనుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డులోని లక్ష్మీదేవి పుంత మైదానంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, వైఎస్సార్ ఆసరా మంజూరు పత్రాలను అందజేస్తారన్నారు. ఇప్పటికే ఆరు గ్రామాల్లో ఈ కార్యక్రమం పూర్తయిందన్నారు. రెండో విడత మడికి, చొప్పెల్ల, బడుగువానిలంక, నర్సిపూడి, నవాబుపేట, మోదుకూరు గ్రామాల్లో జరుగుతుందని చెప్పారు. లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

కార్యకర్తల సమావేశం వాయిదా

పి.గన్నవరం: చాకలిపాలెంలోని కృష్ణబాలాజీ కన్వెన్షన్ హాలులో శుక్రవారం జరగాల్సిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం వాయిదా పడింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సిన ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డి ఢిల్లీ వెళ్లిన నేపథ్యంలో ఈ సమావేశాన్ని వాయిదా వేసినట్టు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. సమావేశం మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ తెలియజేస్తామని చెప్పారు.

డిగ్రీలో ప్రవేశానికి విద్యార్థులకు అవగాహన

రావులపాలెం: ప్రభుత్వ కళాశాలల్లో చేరిన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలను పొందటంతో పాటు, ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చప్పిడి కృష్ణ అన్నారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాల సెకండియర్ విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల రావులపాలెంలో చదువుతున్న సెకండియర్ విద్యార్థులకు ఓపెన్ డే (డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు అవగాహన సదస్సు) ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ కృష్ణ మాట్లాడుతూ డిగ్రీ ఫస్టియర్‌లో చేరే ప్రతి విద్యార్థి కూడా అవగాహనతో, ఆలోచించుకుని, చదివే గ్రూపును నిర్ణయించుకోవాలన్నారు. మంచి విద్యాబోధన అందించే ప్రభుత్వ కళాశాలలను ఎంచుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు స్కాలర్‌షిప్ సదుపాయాలు వర్తిస్తాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేజర్, మైనర్, సబ్జెక్టులను ఎంచుకుని, తద్వారా ఉన్నత స్థానాలకు చేరాలని చెప్పారు. మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు కళాశాల లేబరేటరీలు, గ్రంథాలయం, గేమ్స్, జిమ్, తరగతి గదులు, వసతులు, డిపార్ట్‌మెంట్లను చూపించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్, అధ్యాపకులు సుభాషిణి, సోనీ, హేమలత, సౌజన్య, శ్రీనివాస్, స్వర్ణలత, చినబాబు, రాజేంద్రప్రసాద్, దుర్గాదేవి, శైలజ, రజిని, పూజ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మలికిపురం: లక్కవరం గొల్లపాలెం, మలికిపురం 33/11 కేవీ లైన్ వెంబడి ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, సబ్ స్టేషన్ పనుల కోసం శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ రవికుమార్ గురువారం ఇక్కడ తెలిపారు. తూర్పుపాలెం, లక్కవరం, మలికిపురం, కత్తిమండ, విశ్వేశ్వరాయపురం, రామరాజులంక, దిండి, గుడిమెళ్లంక, మెడిచర్లపాలెం, బట్టేలంక, గొల్లపాలెం, గూడపల్లి, జి.పల్లిపాలెం, గుబ్బలపాలెం, కరవాక(మామిడికుదురు మండలం), మోరిపోడు, మోరి, శృంగవరప్పాడు, టేకిశెట్టిపాలెం, అంతర్వేదిపాలెం(సఖినేటిపల్లి మండలం) గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వివరించారు.

రావులపాలెం: విద్యుత్ సబ్‌స్టేషన్ లైన్ల మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రవికుమార్ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొత్తపేట: బిళ్లకుర్రు, కొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కోసం మండలంలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంబాజీపేట: అంబాజీపేట గంగలకుర్రు ముక్కామల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ఈఈ రవికుమార్ తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మతుల దృష్ట్యా సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు.

జాతీయ టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటలోని ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి బళ్లా సత్యనారాయణ, ఏడో తరగతి విద్యార్థి కొల్లి అజయ్ ప్రతిభ కనబర్చారు. ఇటీవల జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ఏపీ పోటీల్లో అండర్–14 టెన్నికాయిట్ విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఆర్ నాగకుమార్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, తర్ఫీదు ఇచ్చిన పీఈటీ చొల్లంగి లక్ష్మీ శ్రీనివాసరావు ను హెచ్‌ఎం నాగకుమార్, ఉపాధ్యాయులు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఐఎస్ఎస్ ప్రసాద్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు